రోడ్లు వేగంగా నిర్మించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పట్టణంలో త్వరితగతిన రోడ్లు నిర్మించాలని, దానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో భీమవరం మున్సిపాల్టీలో జరుగుతున్న పనులపై కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణాన్ని వేగవంతంగా అభివృద్ధి చేసే విధంగా పనిచేయాలని ఆదేశించారు. భీమవరం జిల్లా కేంద్రం కావడం వల్ల కనెక్టింగ్ రోడ్లను అభివృద్ధి చేసే దిశగా అధికారులు ఆలోచించాలన్నారు. ముఖ్యంగా జువ్వలపాలెం రోడ్డు, డిఎన్ఆర్ కాలేజ్ రోడ్డు, జిల్లా కలెక్టరు కార్యాలయం రోడ్డు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేయలేని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్ ను రద్దుచేసి వేరే కాంట్రాక్టర్కు పనులు అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, పబ్లిక్ హెల్త్ పబ్లిక్ హెల్త్ ఇఇ పి. త్రినాథరావు, టౌన్ ప్లాన్ ఎసిపి గౌరు, టిపిఒ సర్వేశ్వరరావు, డిఇ రాజారావు, అధికారులు పాల్గొన్నారు.

పట్టాలెక్కని.. రైల్వే లైన్లు..!

- ❑ దశాబ్దాలుగా నిధుల కేటాయింపులో నిరాశే
- ❑ రూ.2,145 కోట్ల కొవ్వూరు-భద్రాచలం లైన్కు రూ.20 కోట్లే
- ❑ రూ.2,120 కోట్ల కోటిపల్లి-నరసాపురం లైన్కు రూ.100 కోట్లు
- ❑ రైల్వే బడ్జెట్లో జిల్లాకు తీరని అన్యాయమే
- ❑ రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీల నిర్లక్ష్యమేనని జనం పెదవివిరుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాకు చెందిన రైల్వేలైన్లపై మోడీ సర్కార్ తీరు అత్యంత దారుణంగా మారింది. దశాబ్దాల క్రితం ప్రతిపాదించిన రైల్వేలైన్లను పూర్తి చేయాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం లేకుండాపోయింది. ఏదో నామకేవాస్తే అన్నట్లు నిధులు కేటాయించి మమ అనిపిస్తోంది. ఈ విధంగా నిధుల కేటాయింపు జరిగితే మరో 20 ఏళ్లు అయినా జిల్లాలోని కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లు పూర్తయ్యే పరిస్థితి లేదనే చెప్పొచ్చు. జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి నిధులు తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం, ఇక్కడి ఎంపీలు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందేందుకు దోహదపడే అత్యంత ముఖ్యమైన రైల్వేలైన్ల నిర్మాణం ఓ ప్రహసనంలా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా రైల్వేలైన్ల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్న పరిస్థితి నెలకొంది. 1965 నుంచి ప్రతిపాదనలో ఉన్న కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్పై కేంద్రం అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఈ రైల్వేలైన్ గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాదైనా ఈ లైనుకు సంబంధించి నిధుల కేటాయింపు ఉంటుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. అయితే 151 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ రైల్వేలైనుకు ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.2,140 కోట్లు వరకూ ఖర్చవుతుందని లెక్కలుగట్టారు. అయితే 2023-24 బడ్జెట్లో మోడీ సర్కార్ కేటాయించిన నిధులు కేవలం రూ.20 కోట్లు మాత్రమే. ఈ నిధులు సర్వే పనులకు సైతం చాలవని చెప్పొచ్చు. ఈ విధంగా నిధులు కేటాయిస్తే కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ ఎన్ని దశాబ్దాలు పడుతుందో మోడీ సర్కార్ చెప్పాల్సి ఉంది. ఈ రైల్వే లైన్ పూర్తయితే ఏజెన్సీ, మెట్టప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతోంది. ఈ రైల్వేలైన్ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

కోటిపల్లి-నరసాపురం లైన్కు రూ.వంద కోట్లు మాత్రమే

కోటిపల్లి-నరసాపురం రైల్వేలైనును 2000-01లో మంజూరు చేశారు. రూ.2,120 కోట్లతో 57.12 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మించాల్సి ఉంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు పక్కన పెడితే కేంద్రం గడిచిన బడ్జెట్లో రూ.21.40 కోట్లు ప్రస్తుత బడ్జెట్లో రూ.వంద కోట్లు కేటాయించారు. ఈ విధంగా నిధులు కేటాయిస్తే ఈ రైల్వేలైన్ పూర్తికావడానికి మరో 20 ఏళ్ల పట్టనుంది. ప్రతియేటా అంచనా వ్యయం పెరుగుతూనే ఉంటుంది. ఈ రైల్వేలైన్ నిర్మాణం జరిగితే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని డెల్టావాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయినా పాలకులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఈ రెండు రైల్వేలైన్లు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ పట్టాలెక్కని దుస్థితి నెలకొంది. జిల్లాకు చెందిన ఎంపీలుగాని, రాష్ట్ర ప్రభుత్వంగాని పట్టించుకోకపోవడం వల్లే రైల్వే లైన్ల పరిస్థితి ఈ విధంగా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైల్వేబడ్జెట్లో జిల్లాకు ఏఒక్కటీ లేదు

రైల్వే బడ్జెట్లో జిల్లాకు సంబంధించిన ఏఒక్క అంశమూ లేకుండాపోయింది. నరసాపురం-వారణాసి, నరసాపురం-యశ్వంత్పూర్కు రైళ్లు ఏర్పాటు చేయాలని జిల్లావాసులు కోరుతున్నా పట్టించుకోలేదు. నరసాపురం, చినమామిడిపల్లి వద్ద వంతెన లేదా అండర్ టన్నెల్ ఏర్పాటు, నరసాపురం-హైదరాబాద్ మధ్య రాత్రివేళ అదనపు రైలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ను సైతం పట్టించుకోలేదు. విజయవాడ-భీమవరం, నరసాపురం-నిడదవోలు రెండోలైన్ నిర్మాణం, విద్యుద్దీకరణ పనులకు సంబంధించి పెండింగ్ బకాయిలకు రూ.వంద కోట్లు కేటాయించారు. జిల్లావాసులు రైల్వే పరంగా కలలు ఇప్పట్లో తీరే పరిస్థితి కనుచూపు మేర కానరావడం లేదు.

అంబరాన్నంటిన.. పిల్లల సంబరం

ఘనంగా హేలాపురి బాలోత్సవం ప్రారంభం

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లోకి 'పాడుదమా స్వేచ్ఛా గీతం'

మాట్లాడుతున్న డిఆర్ఒ మూర్తి

'వందలాది మంది విద్యార్థులు.. తాము పాల్గొనదల్చిన పోటీలకు అనుగుణంగా వేషధారణ.. వెరసి ఆ ప్రాంతమంతా కళకళలాడుతుండగా.. 'పాడుదమా స్వేచ్ఛాగీతం' అంటూ అంతా చిన్నారులు రెట్టించిన ఉత్సాహంగా చేసిన ఆలాపన అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

మాట్లాడుతున్న ఎంఎల్సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం పేరిట మూడో పిల్లల సంబరాలు స్థానిక సర్ సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ గ్రౌండ్లో శనివారం ఉదయం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. బాలోత్సవం ప్రారంభ సూచికంగా జాతీయ జెండాను, బాలోత్సవం జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాలోత్సవం ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభ సభ జరిగింది. సభలో ముఖ్యఅతిథి, ఉపాధ్యాయ ఎంఎల్సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో పిల్లల్లో ఆటపాటలు, విజ్ఞానదాయక కార్యక్రమాలు కనుమరుగై యాంత్రికంగా తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కులు, ర్యాంకులే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పిల్లలు భాగస్వాములు కావాలని, అప్పుడే వారిలో మానసిక పరిపక్వత వస్తుందని అన్నారు. బాలోత్సవ కార్యక్రమాలను విస్తరింపజేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. మరో ముఖ్యఅతిథి జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ మారిన పరిస్థితుల్లో పిల్లలు తమ కీలకమైన బాల్యాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాఠశాల విద్యలో క్రాఫ్ట్, ఉడ్ వర్క్, డ్రాయింగ్ తదితర అంశాలుండేవని ఆయన గుర్తు చేశారు. బాల్య జ్ఞాపకాలు జీవితాంతం ఉంటాయని, కాబట్టి ఇలాంటి బాలోత్సవాలు మరెన్నో జరగాలని ఆకాంక్షించారు. డిఇఒ అవధాని మాట్లాడుతూ అందరికీ విద్య అందాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతోపాటు గ్రంథాలయాల్లోని పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు. సిఆర్ రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్వి.ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవాల నిర్వహణ కష్టతరమైనప్పటికీ బాగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అమరావతి బాలోత్సవ నిర్వాహకులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతున్న బాలోత్సవ కార్యక్రమాలను ఉద్యమ తరహాలో విస్తరింపజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపల్ సాయికుమారిశంకర్, స్కూల్ డైరెక్టర్ రాజ్ కల్, దీపక్ నెక్స్జెన్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, మానవత జిల్లా అధ్యక్షులు ఆర్.గంగాధర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కోశాధికారి విజిఎంవిఆర్.కృష్ణారావు, మారుబోయిన కోటేశ్వరరావు, అడుసుమిల్లి నిర్మల, డి.హేమసుందర్, ముస్తఫా ఆలీ, కట్టా సత్యనారాయణ, జె.సత్యనారాయణరాజు, మేతర అజయ్బాబు, కె.శ్రీనివాస్, పి.కిషోర్, డిఎన్విడి.ప్రసాద్, ఎంఎస్ఎంఎస్.కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రవికుమార్, పివి.నరసింహారావు, పలువురు ప్రముఖులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో 'పాడుదమా స్వేచ్ఛా గీతం'

'పాడుదమా స్వేచ్ఛా గీతం' దేశభక్తి పాటను బాలోత్సవం సందర్భంగా వెయ్యి మందికిపైగా ఒకేసారి పాడటంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదు చేశారు. స్థానిక సిఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో బాలోత్సవం ప్రారంభ సభ అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో 'పాడుదమా స్వేచ్ఛా గీతం' పాట నమోదు కోసం చేపట్టిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో పాడుదమా స్వేచ్ఛా గీతం నమోదైనట్లు సర్టిఫికెట్, మెడల్ ఆహ్వాన సంఘ నాయకులకు అందజేశారు.

పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

60 రకాల కల్చరల్, అకడమిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, కోలాటం, శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన, లఘు నాటిక, ఏకపాత్రాభినయం తదితర కల్చరల్ పోటీలతోపాటు క్విజ్, తెలుగులో మాట్లాడటం, కథ చెప్పడం, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర అకడమిక్ పోటీలు నిర్వహించారు.

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి

పేదలకు సత్వర న్యాయం అందించాలి

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆకుల.వెంకట శేషసాయి

ప్రజాశక్తి - నరసాపురం

నిరుపేదలకు సత్వర న్యాయం అందించినప్పుడే ప్రజలకు న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం, గౌరవం కలుగుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆకుల.వెంకట శేషసాయి అన్నారు. పట్టణంలోని వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో నరసాపురం, పాలకొల్లు బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో హైకోర్టు బార్ అసోసియేషన్ ఛైర్మన్ గంటా.రామారావు అధ్యక్షతన న్యాయవాదులకు శనివారం ఒక రోజు సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి వెంకట శేషసాయి మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి ప్రాంత ప్రజలు సౌమ్యులని తెలిపారు. తాను హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్నప్పటికీ నరసాపురంలోని సీనియర్ న్యాయవాది జివికె రామారావు తనకు ఆదర్శమన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్లో ఉచితంగా పరిష్కారం చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే హైకోర్టు మరో న్యాయమూర్తి సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడారు. రాజీ మార్గమే రాజ మార్గం అన్నారు. పంతాలు పట్టింపులకుపోయి ప్రతి చిన్న విషయానికీ కోర్టులకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్టం, ఏలూరులో సదస్సులు నిర్వహించామన్నారు. రాష్ట్ర బార్ అసోసియేషన్ ఛైర్మన్ గంటా.రామారావు మాట్లాడారు. అనంతరం హైకోర్టు న్యాయ మూర్తులు ఆకుల వెంకట శేషసాయి, సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్తో పాటు ఇతర న్యాయ మూర్తులను, బార్ అసోసియేషన్ అధ్యక్షులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సెమినార్లో హైకోర్టు న్యాయమూర్తులు ఎన్.జయసూర్య, సత్తి. సుబ్బారెడ్డి, జిల్లా న్యాయమూర్తి, సి.పురుషోత్తమ కుమార్ పాల్గొన్నారు.

నవుడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నేతలు

కేంద్ర బడ్జెట్కు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్కు వ్యతిరేకంగా ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నవుడూరు సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడారు. రూ.43 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి నష్ట కలిగించే విధంగా ఉందన్నారు. ఒక్కపక్క రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నా, మరో పక్క స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ఇస్తామని ప్రకటించిన మోడీ బడ్జెట్లో ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఎరువుల సబ్సిడీ గతం కంటే రూ.యాభై వేల కోట్లు తగ్గించారన్నారు. ఆహార సబ్సిడీలు సైతం గతం కంటే బాగా తగ్గించారన్నారు. ఆంధ్రరాష్ట్రానికి ఈ బడ్జెట్ ద్వారా తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పోలవరం, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ప్లాంట్, వైజాగ్ మెట్రో ఎయిమ్స్ల ఊసేలేదన్నారు. ఈ కార్యక్రమంలో యాళ్లబండి నారాయణమూర్తి, కిలాడి సత్యనారాయణ, లింగం సత్యనారాయణ, త్రిమూర్తులు, రాంబాబులు పాల్గొన్నారు.

పెంటపాడు : కేంద్రం ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమని సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. స్థానికంగా చేపట్టిన నిరసనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా కావాలని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందని విమర్శించారు. విద్య, వైద్యం తదితర రంగాలకు సరైన కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి ఎ.ఆంజనేయులు, దుర్గ, ధనలక్ష్మి, రమణ, గంగరాజు పాల్గొన్నారు

స్వపక్షం.. నివురుగప్పిన నిప్పేనా..!

చాప కింద నీరులా అధికారపక్షంలో అసమ్మతి

బిజెపితో సఖ్యత.. అభివృద్ధి పనులకు నిధుల లేమిపై పెదవివిరుపు

సమస్యలపై అధికారిక సమావేశాల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే గళమెత్తితే స్వపక్షమే విపక్షమైందని అంతా అంటుంటారు అయితే రాజకీయపరమైన వైరం స్వపక్షంలోనే నివురుగప్పిన నిప్పులా ఉంటే.. బడబాగ్ని కాక తప్పదు. దానికి నెల్లూరు జిల్లాలో అధికార వైసిపిలో నెలకొన్న ప్రకంపనలే నిదర్శనం. అయితే ఆ పరిస్థితి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోనూ చాపకింద నీరులా ఉందని, ఇటీవల కేంద్ర బడ్జెట్పై స్పందన, నిధుల లేమి తదితర అంశాలు అసంతృప్తి అసమ్మతి రూపం తీసుకుంటోందని అధికార పార్టీ నేతలే నెల్లూరు గురించి చర్చల్లో వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

ఏలూరు జిల్లాలో ఇప్పటికే చింతలపూడి నియోజకవర్గంలో అధికార పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. ఇది జంగారెడ్డిగూడెం మున్సిపల్ పాలకవర్గంలోనూ, కామవరపుకోట, లింగపాలెం మండలాల్లోని స్థానిక సంస్థల్లోనూ చాలా స్పష్టంగా కన్పిస్తోంది. కైకలూరు, దెందులూరు, ఏలూరులో కూడా వివిధ కారణాల పేరిట అంతర్గతంగా కుమ్ములాటలు ఉన్నాయి. ఏలూరులో కార్పొరేషన్ విషయంలో పార్టీ పరువు బజారున పడిందని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. అదే క్రమంలో ఈసారి ఏలూరు ఎంఎల్ఎ టిక్కెట్ బిసికి ఇవ్వాలని, ఇస్తారని ప్రచారం జోరందుకోగా ఒక మహిళా కార్పొరేటర్ బహిరంగంగానే పార్టీ అధినేతను కలిసే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది. అదేక్రమంలో కార్పొరేషన్ పెద్దగా వ్యవహరిస్తున్న ప్రముఖులు కూడా టిక్కెట్ రేసులో ఉండటం, కొన్ని అంశాల్లో ఎంఎల్ఎతో విభేదిస్తుండడం ఆ పార్టీ నేతల్లో నెలకొన్న లుకలుకలను ప్రతిబింబిస్తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఏలూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో ఎన్నికల సమయంలో టిక్కెట్ల కేటాయింపు సమయానికి నెల్లూరు తరహా తిరుగుబాట్లు తలెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈలోపు అధిష్టానం జోక్యం చేసుకుని రాజీకి చర్యలు చేపట్టకపోతే తలపోట్లు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇక పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఉండి, భీమవరం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లోనూ అసమ్మతి సెగ నివురుగప్పిన నిప్పులా ఉంది. ఉండి నియోజకవర్గంలో అధికార పార్టీ తరచూ నియోజకవర్గ ఇన్ఛార్జులను మారుస్తుండడమే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. దీనికితోడు మాజీ మంత్రి ఒకరు ఈ నియోజకవర్గంలో నేరుగా జోక్యం చేసుకోవడం ఆ నియోజకవర్గ నేతలకు రుచించడం లేదు. దీంతో ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందో అర్థం కాని పరిస్థితి. టిడిపికి చెందిన మాజీ ఎంఎల్ఎ శివ మళ్లీ రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండటంతో ఆ నియోజకవర్గ సమీకరణల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆయనకంటూ ప్రత్యేక అనుచరగణం ఉంది. అక్కడ గత ఎన్నికల్లో టిడిపి గెలిచినా శివ రాజకీయాలకు దూరంగా ఉండటం, ఎంఎల్ఎ తీరుతో ఆ అనుచరగణమంతా వైసిపి గూటికి చేరింది. శివ మళ్లీ రాజకీయాల్లో క్రియాశీలం కావడంతో వైసిపిలో ఉన్న అనుచరగణమంతా ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. అయితే శివ వచ్చే ఎన్నికల్లో టిడిపి నుంచే బరిలోకి దిగుతారా లేక పార్టీ మారతారా అనే దానిపై స్పష్టత వచ్చేంత వరకూ వారంతా వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా ఇది అక్కడ ఇరు పార్టీలకూ శివ అంశం సకంటంగానే ఉంది. ఇక అధికార పార్టీకైతే ఆశావహులు ఎక్కువ ఉండటం ఇబ్బందికరంగా మారిందని చెప్పొచ్చు. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్పై గెలుపొందారు. తనకు మంత్రి పదవి వస్తుందని రెండుసార్లు భావించినా చివరి నిమిషంలో చేజారిందనే బాధ గ్రంధి అనుచరుల్లో ఉంది. దీనికితోడు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్రాజుకు, గ్రంధికి మధ్య పొరపొచ్చాలు నెలకొన్నాయని, దీనివల్ల ఒకింత ఆధిపత్య పోరు కూడా సాగుతోందని ప్రచారం సాగుతోంది. ఇది రానున్న ఎన్నికల నాటికి ఏరూపం తీసుకుంటుందో వేచిచూడాలి. పాలకొల్లులో ఎంఎల్ఎ టిక్కెట్ రేసులో జెడ్పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్తోపాటు మాజీ ఎంఎల్సి మేకా శేషుబాబు, ఇతరులు ఉన్నారు. ఇక్కడ నేతల మధ్య సయోధ్య లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. ఆచంటలో వారసుడిని రంగంలోకి దింపేందుకు యత్నించడం స్థానిక నేతల్లో అసంతృప్తి నెలకొంది. మొత్తం ఈ పరిణామాలన్నీ ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తికి తార్కాణాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పై అంశాలకు తోడు కేంద్ర బడ్జెట్లో జిల్లాకు, రాష్ట్రానికి ఎటువంటి ప్రాధాన్యతా లేకపోవడం, ఎన్నికలు సమీపిస్తున్న వేళ కనీసం అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గాల్లో ఊపందుకోకపోవడం అధికారపక్ష ప్రజాప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు, రెవెన్యూ లోటు పూడ్చుకునేందుకు ప్రతిసారీ కేంద్రం ముందు మోకరిల్లే బదులు ప్రత్యేక హోదా గురించి నిలదీస్తే కనీసం నిధులైనా విడుదలయ్యేవని, ఇటు ప్రజల్లోనూ తాము దోషిగా ఉండాల్సిన పరిస్థితి ఉండేది కాదని బహిరంగంగానే అధికార పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రంలోని బిజెపికి అన్నివిధాలుగా సహకరిస్తూ మద్దతిస్తున్నా బడ్జెట్లో రాష్ట్రానికి సంబంధించిన కొన్ని అంశాలైనా ప్రస్తావనకు తీసుకురాకపోవడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలోని కోటిపల్లి-నరసాపురం, కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్లకు నిధులు అతితక్కువగా కేటాయించడంపై పెదవి విరుస్తున్నారు. బిజెపితో సఖ్యత, కనీసంగా హామీలు అమలు కాకపోవడం, అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడం వచ్చే ఎన్నికల్లో తమకు ప్రతికూలంగా మారుతాయని వైసిపి ఎంఎల్ఎలు సైతం తలలు పట్టుకుంటున్నారు. వీటికి తోడు అంతర్గత కుమ్ములాటలు మరింత పెరిగితే నెల్లూరు తరహా తిరుగుబాట్లు ఇక్కడా అధికార పార్టీకి తప్పవని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో వేచిచూడాలి.

- విఎస్ఎస్వి.ప్రసాద్

అదానీ మోసాలతో దేశ ప్రతిష్ట పాతాళానికి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

అదానీ కంపెనీ మోసాలతో దేశ ప్రతిష్ట పాతాళానికి నెట్టబడిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు అన్నారు. సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జెఎన్వి గోపాలన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత మహాసభ పిలుపులో భాగంగా ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దీనికి నిరసనగానే చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, ఇచ్చిన వాగ్దానాలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకోకుండా మొండిగా ముందుకు సాగుతోందని విమర్శించారు. మోడీ భుజాన వేసుకున్న కార్పొరేట్ భజన చివరికి దేశ ప్రతిష్టను ప్రపంచ వినువీధుల్లో దిగజార్చిందని విమర్శించారు. రెండు రోజుల క్రితం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలకు కొంత ఉపశమనం కలిగిస్తుందేమో అనుకున్నామని, అదికూడా నీరుగారిపోయిందని విమర్శించారు. ముఖ్యంగా బడ్జెట్లో ప్రజల సమస్యలు పరిష్కారం కాకపోగా విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి ప్రజలకు సంబంధించిన అంశాల్లో కోతలు విధించిందన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ఈ విషయాలన్నింటిపై ప్రజల్లోకి వెళతామని, ప్రజలకు తెలియచేసి ఐక్యతను కూడగట్టి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జిల్లా సదస్సు, కరపత్రాల ద్వారా ఇంటింటికీ ప్రచారం, గ్రూప్ మీటింగ్స్, మోటర్ సైకిల్ యాత్రలు తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళతామని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాలు, సంఘాలకు సంబంధించిన నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి.నాగేశ్వరరావు, ఎస్.రంగారావు, డి.కళ్యాణి, అజయ్కుమారి, డి.జ్యోతి, అల్లూరి అరుణ్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సగంచెరువు గ్రామంలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎంఒ పి.సుధీర్ మాట్లాడుతూ స్పర్శ లేకపోవడం, చేతులు, పాదాలు, నరాలు తిమ్మిర్లుగా అనిపించడం, చర్మంపై రాగి రంగు మచ్చలు వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిఐ హారిక, ఎఎన్ఎం నాగమణి, ఆశ రత్నకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మార్టేరు వెటర్నరీ ఎడి వాకాని ప్రసాద్

త్వరలో కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

త్వరలోనే వీధి కుక్కల సంచారాన్ని అంచనా వేసి ర్యాబిస్ టీకాలు వేయనున్నట్లు మార్టేరు వెటర్నరీ ఎడి వాకాని ప్రసాద్ అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వీధి కుక్కలకు టీకాలు, రోడ్లపై పందులు, ఆవుల సంచారాన్ని నిరోధించడంపై పంచాయతీ కార్యదర్శి, వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పందులు పెంచుకొనే వారికి నోటీసులు జారీ చేసి ఊరికి దూరంగా నివాసం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆవులు, ఎద్దుల యాజమాన్యం వాటిని బయట వదలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో యాజమాన్యంపై అపరాధ రుసుం వేయడం జరుగుతుందన్నారు. కోళ్ల నుంచి తీసిన వ్యర్థం కాలువ, పంట బోదెలోకి వేయకుండా యాజమాన్యానికి సూచనలివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, పెనుమంట్ర వెటర్నరీ వైద్యురాలు జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

యుటిఎఫ్ నేత సత్యప్రకాశరావు మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

దారం సత్యప్రకాశరావు (ఫైల్‌ఫోటో)

యుటిఎఫ్ మాజీ మండల సంయుక్త కార్యదర్శి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అండలూరు గ్రామానికి చెందిన దారం సత్యప్రకాశరావు (69) శనివారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పలు పాఠశాలల్లో పని చేసిన ఆయన 2011లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్నారు. ఆయన ఉపాధ్యాయ నాయకుడిగా అనేక సేవలందించారు. సత్యప్రకాశరావు భౌతికకాయానికి యుటిఎఫ్ నాయకులు జివి. రమణ, ముద్రగడ శ్రీనివాసరావు, కె.నాగమునేశ్వరరావు, డి.పుల్లారావు, ఎ.మాధవరావు, బి.అచ్చియ్య, కె.శ్రీనివాసరావు, మల్లుల రమేష్, పి.హరికృష్ణ, సిహెచ్.కుమార్‌బాబ్జి, నేపలపాటి ప్రసాదబాబు, సర్పంచి పి.భోగేశ్వరరావు, ఎంపిటిసి బొల్లెంపల్లి శ్రీనివాస్ చౌదరి నివాళులర్పించారు.

విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి పోటీలకు ఉదయ్ ఎంపిక

ప్రజాశక్తి - పెనుగొండ

ఈనెల మూడో తేదీన భీమవరం చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో చెరుకువాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి జి.ఉదయ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎవి.రమణమూర్తి శనివారం విలేకరులతో మాట్లాడారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఉదయ్ ఇన్ఫర్మేషన్ యాప్ తయారు చేసి ప్రథమ స్థానం సాధించాడని తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థి మహేష్ డెబిట్‌లో తృతీయ స్థానం సాధించాడని తెలిపారు. వారికి తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయుడు బిఎల్ నరసింహమూర్తి కృషిని అభినందించారు.

కుష్టుపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వద్ద జాతీయ కుష్టు వ్యాధి నిరోధక పక్షోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్యజీవన్ గ్రామస్తులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కుష్టు వ్యాధి వయస్సుతో సంబంధం లేకుండా ఎవరికైనా రావచ్చన్నారు. చర్మం మీద పాలిపోయిన, లేదా రాగి రంగు మచ్చలు, స్పర్శ లేకుండా నున్నగా చర్మం మీద వెంట్రుకలు రాలిపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా మైక్రో బ్యాక్టీరియం లెప్రె అనే సూక్ష్మక్రిమి వల్ల వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ఆరు నుంచి 12 నెలలు బహుళ ఔషధం చికిత్స ద్వారా మందులు వేసుకోవడం వల్ల ఈ వ్యాధి నయమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, సెక్రటరీ ఆనందంబాబు, ఎంఎల్‌హెచ్ పి దేవి, ఎఎన్ఎం మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ (మేల్) మేడిది మధుకుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు జాబితా సిద్ధం

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లాలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ శనివారం తెలిపారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి, కో-ఆప్షన్ సభ్యులతో కూడిన జాబితాను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

విఆర్‌కు పాలకొల్లు సిఐ షేక్‌అఖిల్‌జామ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ సిఐ షేక్ అఖిల్ జామ విఆర్‌లోకి వెళ్లారు. ఆయన స్థానంలో నరసాపురం సిఐ శ్రీనివాస్ యాదవ్ పాలకొల్లు పట్టణ సిఐ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు. పట్టణంలో ఒక కేసుకు సంబంధించి వివాదాల్లో సిఐ తలదూర్చినట్లు ఉన్నతాధికారులకు రూఢీ కావడంతో ఆయనను అధికారులు విఆర్‌కు పంపారు.

నేరాలు - ఘోరాలు

క్రికెట్ బెట్టింగ్ రాయుడు అరెస్టు

ప్రజాశక్తి - కాళ్ల

జక్కరం గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక సాంసంగ్ టీవీ, ఒక ల్యాప్‌టాప్, మూడు స్మార్ట్ ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్, రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గీతా రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జక్కరం గ్రామంలో నంద్యాల కిషోర్ తన ఇంటిలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గీతా రామకష్ణ పర్యవేక్షణలో కాళ్ల పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో కిషోర్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఒక సాంసంగ్ టీవీ, ఒక ల్యాప్‌టాప్, మూడు స్మార్ట్ ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్, రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మానవ తప్పిదాలతో తాగునీరు కలుషితం

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - వీరవాసరం

మానవ తప్పిదాల వల్లే తాగునీరు కలుషితమవుతోందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తోలేరు పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంఎల్ఎ ప్రారంభించారు. పడమటిపాలెంలో మూడు గ్రామాలకు ఉపయోగపడే విధంగా తోలేరు గ్రామానికి చెందిన సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైయివేట్ లిమిటెడ్ అధినేత ఇర్రింకి సూర్యారావు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఆర్ఒ మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామంలో ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆదాయం తప్ప ఆరోగ్యం గూర్చి పట్టించుకోలేని ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వీరవాసరం మండలంలో ఫేజ్ -1, 2 కలిపి మొత్తం రూ.22 కోట్లతో తాగునీరందించేందుకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం తోలేరులో శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ గ్రామంలో రూ.ఐదు లక్షలతో సీసీ డ్రెయిన్, ఉత్తరపాలెంలో రూ.మూడు లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యమిత్ర అధినేత ఇర్రింకి సూర్యారావు, సర్పంచి వేంద్ర లీలావెంకటకృష్ణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, ఉపసర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

వైసిపిలో ఒక వర్గం దూరం..

తోలేరులో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కార్యక్రమానికి గ్రామంలో ఒక వర్గం దూరంగా ఉండడంతో స్థానికంగా చర్చంశనీయాంశమైంది. ప్రస్తుతం గ్రామంలో రెండు వర్గాలు ఉన్నాయి. భోగిరెడ్డి శ్రీనివాసరావు వర్గం కాగా, చవాకుల సత్యనారాయణమూర్తి మరో వర్గంగా ఉన్నారు. శనివారం ఎంఎల్ఎ కార్యక్రమంలో చవాకుల సత్యనారాయమూర్తి వర్గానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనకపోవడం గమనార్హం.

ఖాళీ కంచాలతో విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

సంక్షేమ హాస్టళ్లలో సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని, తక్షణం హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ బొమ్మ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ 2018లో ఉన్న మెస్ ఛార్జీలను 2023లోనూ కొనసాగించడం దారుణమన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ హాస్టళ్లను నాడు-నేడులో చేర్చి సొంత భవనాలు నిర్మించాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించకపోతే త్వరలోనే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. హాస్టల్ విద్యార్థి వినోద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు జి.శ్రీను, గణేష్, దేవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

విచక్షణా రహితంగా పురుగుమందులు వాడొద్దు

ప్రజాశక్తి - అత్తిలి

రైతులు విచక్షణా రహితంగా పురుగుమందులు పిచికారీ చేయొద్దని వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పాలూరు రైతు భరోసా కేంద్రంలో ఎరువుల వినియోగంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రం ద్వారా అందుతున్న సేవల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు విచక్షణారహితంగా పురుగుమందుల వాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ టికె.రాజేష్, ఉపసర్పంచి రాపేటి వెంకట సింహాచలం, పంచాయతీ కార్యదర్శి యు.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - ఉండి

ప్రతి నియోజకవర్గంలోనూ అంబేద్కర్ భవనాన్ని ఏర్పాటు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అర్తమూరులో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దళితులంతా రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాల మహానాడు కమిటీలను బలోపేతం చేసి దళితవాడలోని సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడిగా అర్తమూరు గ్రామానికి చెందిన జొన్నల వజ్రంకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు చిగురుపాటి రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా కార్యదర్శులు చిల్లి రాజ్‌కుమార్, కోలాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేన్సర్ వచ్చిన వారు నిరుత్సాహ పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని శశి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు. శశి ఇంజినీరింగ్ కళాశాల, హైస్కూల్ ఎన్‌సిసి క్యాడెట్స్ ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రజలకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎమ్‌డి ఇస్మాయిల్, కోఆర్డినేటర్లు పిఎస్.శేఖర్, కె.ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : కేన్సర్‌కు చికిత్స ఉందని ఒమేగా హాస్పటల్ ఎమ్‌డి డాక్టర్ గోపాలరాజు అన్నారు. శనివారం వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా ఒమేగా భీమవరం హాస్పటల్ ఆధ్వర్యంలో 3కె రన్ నిర్వహించారు. ముందుగా హాస్పటల్ నుంచి డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానం వరకూ 3కె రన్ నిర్వహించారు. డాక్టర్ గోపాలరాజు, ఒమేగా హాస్పటల్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ దార హరీష్, మెడికల్ అంకాలజిస్ట్ నల్లం శ్రీకాంత్, డాక్టర్ కంతేటి ఆదిత్య పవన్‌కుమార్ మాట్లాడుతూ అవగాహన పెంపొదించుకుని మెరుగైన వైద్యం తీసుకుంటే కేన్సర్‌ను జయించవచ్చని తెలిపారు. ప్రస్తుతం కేసులు ఎక్కువగానే పెరుగుతున్నాయన్నారు. కేన్సర్ వస్తే కుంగిపోవద్దని దానికి చికిత్స ఉందని అన్నారు. డిఎన్ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ఎస్ఆర్‌కెఆర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఉమెన్ ఎంపవర్ మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలు కోరుతూ సిపిఎం నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతమైన శ్రీ కేదారేశ్వర స్వామి పుష్కర ఘాట్‌ను, శ్మశాన స్థలాన్ని పుణ్య భూమిగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని పలు గ్రామాల ప్రజలు సిద్ధాంతం గ్రామంలో శనివారం నిరసన తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ పెద్దలను, ప్రజలను కలిసి సంతకాలు సేకరించారు. సిద్ధాంతం బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిద్ధాంతం గ్రామ సర్పంచికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ సిద్ధాంతం శ్మశానంలో దహనం చేయడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధ్వానంగా ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని గత తెలుగుదేశం పార్టీ పాలకులు, ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసిపి పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోయాయన్నారు. గ్రామంలో చెత్తను శ్మశానస్థలంలో వేయడంతో డంపింగ్ యార్డుగా మారిందన్నారు. సిద్ధాంతం నదీ పరివాహక శ్మశాన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శ్మశాన ప్రాంత అభివృద్ధికి దేవదాయ శాఖ అధికారులు కేదారేశ్వరస్వామి దేవస్థానం ఆదాయం నుంచి రూ.65 లక్షల వరకు కేటాయించారని, మిగిలిన మొత్తం ప్రభుత్వం నుంచి ఖర్చు చేస్తుందని సిద్ధాంతం గ్రామ సర్పంచి చింతపల్లి గనిరాజు తెలిపిన సమాచారం మేరకు వెంటనే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిద్ధాంతం గ్రామ ప్రముఖులు నక్కా సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, కప్పల రత్నరాజు, కుడుపూడి సూర్యనారాయణ, మామిడిశెట్టి వెంకట్రావు, మన్నే వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, గెద్దాడ శ్రీను, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కష్టసుఖాల నుంచి పుట్టినవే కళలు



విశ్వనాథ్, జమున చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి -భీమవరం

ప్రజల కష్టసుఖాలు నుంచే కళలు పుట్టాయని, వాటిని ప్రజలకు అంకితం చేయాలని పరితపించిన మహోన్నత వ్యక్తులు డైరెక్టర్ కె.విశ్వనాథ్, సీనియర్ నటి జమున అని ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ వలి, చైతన్య ప్రసాద్ అన్నారు. స్థానిక మెంటే వారి తోటలో విశ్వనాథ్, సీనియర్ నటి జమున చిత్రపటాలకు ప్రజారాజ్యమండలి భీమవరం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి సంతాప సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజానాట్యమండలి టౌన్ నాయకులు రంగా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏసోబు, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, వర్మ, కల్యాణి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : కళాతప్విని కె.విశ్వనాథ్ సంతాప సభ కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక, వివిధ అసోసియేషన్‌లతో శనివారం నిర్వహించారు. పలువురు విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాహితీ వేత్త శ్రీనివాస భారతి సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ ఎస్‌టివి.రాజగోపాలచార్యులుమాట్లాడుతూ భారతీయ సంస్కతి సంప్రదాయాలకు లలిత కళలు కనుమరుగవుతున్న తరుణంలో దర్శకులు కె.విశ్వనాథ్ తన చిత్రాల ద్వారా వాటిని పునరుద్ధరించారన్నారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజ భక్త సభ ఉపాధ్యక్షులు గమని రాజు, సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, చైతన్య భారతి సభ్యులు పేరిచర్ల లక్ష్మణవర్మ పాల్గొన్నారు.

ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ జిల్లా ఉపాధ్యక్షునిగా గోపాలకృష్ణ

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షునిగా మొగల్తూరు గ్రామానికి చెందిన లక్ష్మీహరిప్రియ గ్యాస్ ఏజెన్సీస్ డిస్ట్రిబ్యూటర్ అనంతపల్లి గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇటీవల అత్తిలిలో జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సంఘ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కృష్ణ ఏకగ్రీవంగా ఉపాధ్యక్షునిగా ఎంపికయ్యారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని విభాగాలు, నాడు-నేడు పనులు పరిశీలించారు. పాఠశాల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందటాన్ని చూసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేలపాటి వెంకటరమణ, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

6న హెచ్‌ఐవి బాధితులకు వ్యాక్సిన్

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎన్‌విహెచ్‌సిపి ద్వారా ఈ నెల ఆరో తేదీ సోమవారం తణుకు కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో హెచ్ఐవి సోకిన బాధితులకు హెచ్‌బివి వాక్సిన్ వేస్తున్నారని ఎఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ఎఆర్‌టి సెంటర్‌లో హెచ్‌బివి వాక్సిన్ కార్యక్రమాన్ని జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.శివప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు.

నూరు శాతం గ్రాస్ శాలరీ అందించాలి

నేడు తాడేపల్లిగూడెంలో ఆరోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగుల కీలక సమావేశం

ప్రజాశక్తి- భీమవరం

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన నూరు శాతం గ్రాస్ శాలరీ అందించాలని ఆంధ్ర ప్రదేశ్ కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివి.ప్రసాద్, జిల్లా కన్వీనర్ నేతల ప్రకాష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూరు శాతం గ్రాస్ శాలరీ సాధన కోసం ఆదివారం తాడేపల్లిగూడెం ఎన్‌జిఒ హోమ్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు కీలక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘ ముఖ్య నేతలందరూ హాజరవుతున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయంగా రావాల్సిన నూరు శాతం గ్రాస్ శాలరీ విషయంలో కూడా గత, ప్రస్తుత ప్రభుత్వాలు దోభూచులాటలాడుతూ తీరని అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

కాళీపట్నం భూముల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని భూములను, రికార్డులను రెవెన్యూ అపీళ్ల కమిషనర్ లక్ష్మీనరసింహ శనివారం పరిశీలించారు. కాళీపట్నం రెవెన్యూ భూముల సమస్య సుమారు ఐదు దశాబ్దాలుగా కొనసాగుతోంది. పదేళ్ల కిత్రం అప్పటి తహాశీల్దార్ అహ్మద్ జామా ఈ భూములకు రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశారు. అప్పటినుంచి క్రయ విక్రయాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంత రైతులు పలు పర్యాయాలు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఇటీవల చేపట్టిన రీ సర్వేలో భాగంగా ఆయన పర్యటించి భూములను పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు తహాశీల్దార్ జి.అనిత కుమారి, సర్వే ధనుంజయ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రభుత్వ పాఠశాలలు ఆహ్లాదకర వాతావరణంలో ఉన్నాయని, విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని విద్యా శాఖ మండల కో-ఆర్డినేటర్ తోకల జనార్దన్ కోరారు. పాలకొల్లులో నాడు-నేడు మొదటి విడతలో 29 పాఠశాలలకు మంటలు ఆర్పే యంత్రాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నాడు-నేడు పథకం తరువాత బలోపేతం అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, సిఆర్‌పి టి.శ్రీనివాస్, రామకృష్ణ, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ శనివారం విచ్చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదం, స్వామి వారి ఫొటో అందించారు. వారికి ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషాలక్ష్మీకుమారి, ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భానుశ్రీ, ఇన్‌ఛార్జి తహాశీల్దార్ నాగదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివి సుబ్బారావు, రూరల్ సిఐ శ్రీనివాస్ స్వాగతం పలికారు.

గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

లబ్ధిదారులతో జగనన్న గృహ నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయించకపోతే ఎలా అని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ ఎవిఎ రామస్వామి ప్రశ్నించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో వివిధ స్థాయిలో ఉన్న నిర్మాణాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని గ్రామాల్లో కదలిక లేకపోవడానికి కారణాలు ఏంటని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి 16వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, డ్వాక్రా సిసి సత్యవతి పాల్గొన్నారు.

పోడూరు : జగనన్న కాలనీలో లబ్ధిదారులు వేగవంతంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పిలుపునిచ్చారు. కొమ్ముచిక్కాల జగనన్న కాలనీని శనివారం వారు సందర్శించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం పనుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి పెద్దిరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరాజు మాట్లాడుతూ కాలనీలో ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఆదిశేషులు, వైసిపి సీనియర్ నాయకులు గుంటూరి చంటిరాజు, ఎంపిడిఒ ఎం.బలరామరాజు, హౌసింగ్ ఎఇ వెంకటరాజు, నాగరాజు బాలాజీ వర్మ పాల్గొన్నారు.

మొగల్తూరు : లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి మూడేళ్లు దాటినా ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారికి నోటీసులు జారీ చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి విఆర్‌ఒలను ఆదేశించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని కెపిపాలెం నార్త్‌లోని పోతాబత్తులవారి మెరకలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆప్షన్ 3 ద్వారా కాంట్రాక్టర్‌తో నిర్మాణాలు చేపట్టిన వారికి రూ.35 వేలు రుణం మంజూరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాలకోడేరు : జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డిఇ బి.వెంకటరమణ అన్నారు. మండలంలోని కోరుకొల్లు, కొండేపూడి గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడారు. ఆప్షన్ 3 కింద ఇంటి నిర్మాణాలు చేయించుకునేవారు తమ వివరాలను ఇంజినీరింగ్ సహాయకులకు అందించాలన్నారు. కోరుకొల్లు జగనన్న కాలనీలో పూర్తయిన విద్యుద్దీకరణ పనులను పరిశీలించారు. ఆయనతో పాటు అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంతెన యోగీంద్రబాబు, తహాశీల్దార్ ఎస్‌కె.హుస్సేన్, గృహనిర్మాణ శాఖ ఎఇ బివి.నరసింహరావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌కుమార్ ఉన్నారు.

విస్తృతంగా సేవాకార్యక్రమాలు చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వికె.పంకజక్షన్ సభ్యులకు సూచించారు. శనివారం సాయంత్రం పలువురికి పండ్లు, బియ్యం, దుప్పట్లు ఆయన పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుడు రాయుడు లక్ష్మణ్‌రావు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరిక నిర్మూలనకు సభ్యులందరూ కూడా కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో రివిజనల్ ఛైర్ పర్సన్ కె.రామలింగేశ్వరరావు, జోనల్ ఛైర్‌పర్సన్ ఎ.నళినీదేవి, మొగల్తూరు క్లబ్ అధ్యక్షులు కడిమి సాంబమూర్తి, కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పార్టీ కోసం సమిష్టిగా పని చేయాలి : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సారధులు వైసిపి కోసం పనిచేయాలని డిసిసిబి ఛైర్మన్, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. జువ్వలపాలెం, పెదఅమిరం గ్రామాల్లో వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారధులకు శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో వాలంటీరర్లు, కన్వీనర్లు, గృహ సారధులు ప్రజల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, గ్రామ సర్పంచులు మీసాల రమణ, డొక్కు సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సొసైటీ అధ్యక్షులు పెనుమత్స దుర్గా ప్రసాదరాజు పాల్గొన్నారు.